నిర్వాసితుల జీవితాలతో చెలగాటం

- ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి, ఇళ్లు ఖాళీ చేయాలంటున్న అధికారులు
- స్థలాలకు లాటరీ తీసినంత సులభం కాదంటున్న బాధితులు
- ఆందోళన చెందుతున్న నిర్వాసితులు
- బ్లాస్టింగ్ చేస్తే ప్రాణాలకే ముప్పు


నిర్వాసితుల కోసం దుద్దికలోవలో ఏర్పాటు చేసిన లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు

తుని రూరల్: ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చేసి ఉన్నపలంగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలన్న అధికారుల తీరుపై కుమ్మరిలోవ కాలనీకి చెందిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్వాసితులు మండిపడుతున్నారు. ఇప్పుడు ఎక్కడికి ఎలా పోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. పుష్కరకాలం కిందట భూసేకరణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు 472 నిర్వాసిత కుటుంబాలకు గత నెల 27న లాటరీ ద్వారా ఇళ్లస్థలాల కేటాంచి, గురువారం పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్లస్థలాలు కేటాయింపు సమస్య సర్దుమణిగిందని ఊపిరి పీల్చుకున్న నిర్వాసితులపై ఈ నెల నాలుగో తేదీకి ఇళ్ల ఖాళీ చేయాలని అధికారులు మంగళవారం దండోర వేయించడం పిడుగు పడినట్టయ్యింది. దీంతో ఆందోళన చెందిన నిర్వాసితులు ఇప్పటికిప్పుడు ఎక్కడికిపోవాలంటూ రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవడమంటే ఇళ్ల స్థలాలకు లాటరీ తీసినంత సులభం కాదని, అద్దె ఇళ్లు లభించడంలేదని నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఇళ్లు ఖాళీ చేయకుండా పోలవరం కాలువ తవ్వకానికి బ్లాస్టింగ్ పనులు చేస్తే కాలనీలో నివాసం ఉంటున్న నిర్వాసితుల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. సొంతభూములు, పశువులు ఒక్కడ వదిలేసి ఇళ్లు ఖాళీ చేయమంటే ఎక్కడికి ఎలా పోవాలని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. మండల పరిషత్ పాఠశాలసైతం మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లు ఖాళీ చేయడానికి కొంత గడువు ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

1986లో కుమ్మరిలోవ కాలనీ ఏర్పాటు

తుని నుంచి కొట్టాం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని 1986లో కుమ్మరిలోవ కాలనీ ఏర్పడింది. తుని పట్టణానికి కిలో మీటరు దూరంలో ఉండడంతో కుమ్మరిలోవ గ్రామస్తులే కాకుండా తునికి చెందిన కార్మిక, ఉద్యోగ, ఉపాధి చేసుకునే ఎన్నో కుటుంబాలు కాలనీలో నివాసం ఉంటున్నాయి. కాలనీని ఆనుకుని ఉన్న కొండపై నుంచి పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎలైన్‌మెంట్ వచ్చింది. దీంతో కాలనీలో ఇళ్లను భూసేకరణలో పెట్టారు. ఈ ప్రక్రియ 2009 నుంచి ప్రారంభమైన 2011–13 మధ్య నోటిఫికేషన్ ద్వారా నిర్వాసితుల జాబితాను సిద్ధం చేశారు. జాబితాలో అనర్హుల పేర్ల నమోదు చేయడం, కొంత మంది అర్హుల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించడంతో అప్పటి నుంచి వివాదాలు జరుగుతున్నాయి. పలుదఫాలు సవరణలు తర్వాత


నిర్వాసితులు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న కుమ్మరిలోవ కాలనీ ఇళ్లు, స్కూల్


ఇళ్లు ఖాళీ చేయకుండానే కొండపై పనులు చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది

2017–18లో నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ, రెండు సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. తమకు అన్యాయం జరిగిందని ఇళ్లస్థలాలకు భూములిచ్చిన రైతులు కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దాంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది.

కలెక్టర్ చొరవతో..

ఇటీవల కలెక్టర్ చొరవతో రైతులు, నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యాయి. మిగిలి ఉన్న నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ, రెండు సెంట్లుగా ఉన్న ఇళ్లస్థలాన్ని మూడు సెంట్లుగా మంజూరు చేశారు. స్థలాభావంతో రెండు చోట్ల లేఅవుట్లు వేసి గత నెల 27న బహిరంగంగా లాటరీలో 472 కుటుంబాలకు ఇళ్లస్థలాలు కేటాయించారు. వీరంతా ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకోవడం, లేదా అద్దె ఇళ్లకు వెళ్లాల్సి ఉంది. గ్రామంలో పెద్దసంఖ్యలో అద్దె ఇళ్లు లభించే అవకాశం లేదు. పొలాలు, పాడిపశువుల ఆలనాపాలనా చూసుకునేందుకు అనువైన అద్దె ఇళ్ల కోసం నిర్వాసితులు వెతుకులాట ప్రారంభించారు. ఈ దశలోనే ఈ నెల నాలుగో తేదీకి ఇళ్లు ఖాళీ చేయాలని, ఆ రోజు నుంచి బ్లాస్టింగ్ పనులు మొదలవుతాయని రెవెన్యూ అధికారులు దండోర వేయించారు. దీంతో ఆందోళన చెందిన నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేయడానికి గడువు ఇవ్వాలని, కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనువుగా తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

ఇల్లు వదిలేసి ఎక్కడికి పోవాలి ?

కుమ్మరిలోవ గ్రామం పరిధిలోనే ఇప్పటి వరకు ఇల్లు, కొంత సాగు భూమి, పశువులు ఉన్నాయి. భూసేకరణలో ఇల్లు కోల్పోయాం. సాగుభూమి, పశువులను వదిలేసి ఎక్కడికిపోవాలి. కేటాయించిన స్థలంలో పాకో, పందిరో వేసుకునేందుకు గడువు ఇవ్వాలి.

– వెంకటరత్నం, నిర్వాసితురాలు

ఇంటి స్థలం ఇచ్చేస్తే సరిపోతుందా ?

భూ సేకరణలో ఇళ్లను తీసుకుంటున్నట్టు ప్రకటించినప్పటి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పరిహారం, ఇంటి స్థలం ఇవ్వడానికి ప్రభుత్వానికే పదేళ్లకుపైగా పట్టింది. ఇప్పుడు ఇంటి స్థలం ఇచ్చేసి పొమ్మంటే ఎలా. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు సమయం ఇవ్వాలి.

– దుర్గాభవానీ, నిర్వాసితురాలు

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నాం

పోలవరం కాలువ పనులు వేగవంతంగా చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం. ఇళ్లు ఖాళీ చేయాలన్న డిమాండ్ నిర్వాసితుల నుంచి వచ్చింది. ఈ వ్యవహారంపై ఉన్నత అధికారులు నిర్ణయం తీసుకుంటారు. మౌలిక వసతుల కల్పన పనులను ఆయా విభాగాలు చేపట్టాయి.

– జీవీఎస్ ప్రసాద్, తహసీల్దార్, తుని

క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

తుని రూరల్: వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్దగల సాయివేదికలో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొంటారన్నారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాలు, తుని పట్టణానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

తుని: అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షణకు ఈ నెల 8న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జీజీవీ రమణ గురువారం తెలిపారు. బస్సు ఆ రోజు ఉదయం 10 గంటలకు తునిలో బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనానంతరం అరుణాచలం చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ ముగిశాక తిరుగు ప్రయాణంలో కంచి దర్శనం చేయించి 11వ తేదీ రాత్రికి తుని చేరుతుందన్నారు. ప్రయాణ చార్జీగా రూ.3,500 నిర్ణయించామన్నారు. టికెట్లు కావలసినవారు 73829 13216, 85550 55080, 73829 13016 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితులకు ఎమ్మెల్యే యనమల దివ్య ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గురువారం గెడ్లబీడు సమీప ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, యనమల రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్టియన్ డే

తుని: స్థానిక ఉన్నవాడు అనువాడు క్రైస్తవ చర్చిలో గురువారం క్రిస్టియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ తుని టౌన్, రూరల్ గౌరవాధ్యక్షులు కె.ఫిలిప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అడ్వైజర్ కె.యోహాన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవ సోదరులు జీసస్ సూచించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు త్రినాథ్, షాల్మన్‌రాజు, ఆనంద్‌కుమార్, జి.ఆనంద్, జేఎస్ జాషువ, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

తుని రూరల్: రేఖవానిపాలెం శివారు మరువాడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత గ్రాడ్యుషన్ డే ప్రాముఖ్యతను వివరించారు. ఆరేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రత్తిపాడు: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు కోరారు. ప్రత్తిపాడు విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం మండల యూటీఎఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో బడి ఈడు గల పిల్లలను గుర్తించి, వెంటనే వారిని ప్రభుత్వ బడుల్లో చేర్పాలన్నారు. పాఠశాలల పునర్నిర్మాణంలోనూ, ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవడంలోనూ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, ప్రభుత్వ బడుల బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వీవీ రమణ, జిల్లా ప్రతినిధి చుక్కల గణేష్, యూటీఎఫ్ ప్రతినిధులు జి.ప్రసాద్‌బాబు, డి.రాజబాబు, లక్ష్మీనారాయణ, స్వామి పాల్గొన్నారు.

మొలకశాతం తెలుసుకుని నారుమళ్లు వేయాలి

శంఖవరం: వరి విత్తనాల మొలక శాతం తెలుసుకుని నారుమళ్లు వేయాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. మండలంలోని కొంతంగి రైతు సేవా కేంద్రంలో రైతులకు గురువారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు నారుమడులో వరి విత్తనాలు వేసే ముందు ఇంటి వద్దే మొలక కట్టాలన్నారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మౌళిప్రసాద్, తరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

జగ్గంపేట: ఖరీఫ్ వరిసాగులో మెళకువలు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చని జగ్గంపేట వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం అన్నారు. జగ్గంపేట రైతు సేవా కేంద్రం–2లో గురువారం ఖరీఫ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దుక్కులు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నారుమళ్లు ఎత్తయిన ప్రదేశంలో వేసుకోవాలని సూచించారు. రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

కౌన్సిలర్ హైమావతికి ముద్రగడ పరామర్శ


సుంకర దంపతులను వివరాలు అడుగుతున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: ఇటీవల అనారోగ్యానికి గురైన స్థానిక నగర పంచాయతీ కౌన్సిలర్ సుంకర హైమావతిని గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. స్థానిక దిబ్బలపాలెంలోని హైమావతి ఇంటి వద్ద ఆమె భర్త, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర రాంబాబును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ భవిష్యత్ కార్యచరణపై వారితో చర్చించారు. రాబోయే రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాల విధివిధానాలపై నాయకులకు పలు సూచనలు చేశారు. పార్టీ నాయకులు సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, పేకల జాన్, శిడగం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ముద్రగడ ప్రత్యేక పూజలు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు (పీఏసీ) ముద్రగడ పద్మనాభం, పద్మావతి దంపతులు, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు గురువారం కిర్లంపూడిలోని పలు ఆలయాలను దర్శించుకున్నారు. స్థానిక నూకాలమ్మ అమ్మవారు, వైద్యనాథేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ఏలేశ్వరం: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో బాలల పరిరక్షణపై మిషన్ వాత్సల్య పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలల పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, బాలల అమ్మకం, బాలల శ్రమదోపిడి, బాలకార్మిక వ్యవస్థలను నిరోధించాలన్నారు. అనంతరం బాలలకు పుస్తకాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో బాలలకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

కంప్యూటర్, ప్రింటర్ ప్రారంభం

ఉపాధి హామీ పథకం కార్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన కంప్యూటర్, ప్రింటర్‌లను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంఈఓకు సమ్మె నోటీసు అందజేత

ప్రత్తిపాడు: దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సమ్మెలో పాల్గొంటున్నామని మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) కార్మికులు గురువారం ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీ అధ్యక్షురాలు పి.వరలక్ష్మి మాట్లాడుతూ ఎండీఎం కార్మికులకు వేతనాలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వంట చేసే ప్రాంతంలో ఫస్ట్ ఎయిడ్ అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తులకు ఈ పథకాన్ని అప్పగించరాదని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న చేపట్టే సమ్మెలో ఎండీఎం కార్మికులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీఎం కార్మిక సంఘ నాయకులు అనంతలక్ష్మి, మంగాలక్ష్మి, మహాలక్ష్మి, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు రూరల్: పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ వి.రాజబాబు సూచించారు. మండలంలోని చింతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. యూ డైస్ పూర్తి చేయాలని, ప్రతిఒక్కరికీ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేయాలనీ, 10న జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థులు అందరూ నూతన యూనిఫాంతో వచ్చేలా చూడాలని, సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ రాంజీ ప్రసాద్, లలితాంబ తదితరులు పాల్గొన్నారు.

రాజుబాబు కుటుంబానికి తోట పరామర్శ

కిర్లంపూడి: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత అడారి రాజుబాబు కుటుంబాన్ని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ గురువారం పరామర్శించారు. పాలెం గ్రామానికి చెందిన రాజుబాబు మాతృమూర్తి రాజేశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా తోట రాంజీ పాలెంలోని రాజుబాబును పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల సుబ్బారాయుడు, తోట అయ్యన్న, ఆరిశ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పాలెంలో గణేశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోట రాంజీ తదితరులు

నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో నూతనంగా మరో 19 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో చేపడుతున్న పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై చర్చించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఉన్న 227 పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పోలింగ్ కేంద్రాలపై రివెరిఫికేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్ నివేదిక అందజేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో 1,150 మంది ఓటర్లకు మించి ఉంటే అటువంటి వాటిని గుర్తించి, అదే గ్రామంలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. శిధిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రాలు, పేరు మార్పు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, మత పరమైన సంస్థల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వేరొక స్థానానికి బదిలీ చేసేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 227 పోలింగ్ కేంద్రాల బూత్ లెవెల్ అధికారులు ఖాళీలను భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 1,150 కన్నా ఎక్కువ మంది ఉన్న 19 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. 18 పోలింగ్ కేంద్రాల ప్రదేశాల మార్పునకు, పేరు మార్పు చేసేందుకు రెండు పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై రాజకీయ నాయకులు తాము గమనించిన అంశాలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు శేరు కృష్ణ, శింగిలిదేవి సత్తిరాజు (బీజేపీ), ధరణాలకోట శ్రీను (కాంగ్రెస్), రొంగల ఈశ్వరరావు (సీపీఐ-ఎం), మోర్త వీరబాబు (జనసేన)లతో పాటు ఏలేశ్వరం నగర కమిషనర్ ఎం.సత్యనారాయణ, తహసీల్దార్లు ఎం.సూర్యప్రభ, కుశరాజు, తాతారావు, నరేష్, డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి పాల్గొన్నారు.

ఐదుగురిపై బైండోవర్ కేసులు

కిర్లంపూడి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఐదుగురు వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని రామకృష్ణాపురంలో గుర్తు తెలియని వ్యక్తులు పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్సై జి.సతీష్‌తో కలసి అక్కడకు చేరుకుని ఐదుగురిని ఆదుపులోకి తీసుకున్నామన్నారు. పిఠాపురం మండలం విరవకు చెందిన ఒకరు, గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు, కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినా, మాదక ద్రవ్యాలు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరుగురు బైండోవర్

గండేపల్లి: స్థల వివాదం ఘటనలో ఆరుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మల్లేపల్లికి చెందిన రెండు కుటుంబాల మధ్య స్థలం సరిహద్దు విషయంలో వివాదం నెలకొంది. వీరు తరచూ గొడవ పడుతుండటంతో ఎస్సై యువి శివ నాగబాబు ఇరువురిపై బైండోవర్ కేసు నమోదు చేసి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కంటైనర్

తొండంగి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద డివైడర్‌ను గురువారం కంటైనర్ ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కంటైనర్ ట్యాంకర్ లారీ తమ్మయ్యపేట వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సెంట్రల్ లైటింగ్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు లారీ ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది, హైవే పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

రామారావుకు డాక్టరేట్

తొండంగి: గ్రామానికి చెందిన వడ్డాది చిట్టి రామారావు అమెరికాలోని ఫ్రాంక్‌ఫర్ట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఐబీఎం సంస్థ జనరల్ మేనేజర్‌గా సేవలందిస్తున్న రామారావు స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి వరకూ చదివారు. ఇంటర్, గ్రాడ్యుయేషన్ కాకినాడలో చేశారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లక్నో యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ కోర్సును చేశారు. కాకినాడ ప్రగతి ఇంజినీరింగ్ కాలేజీ ఆఫ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాయకత్వం, మార్గదర్శకత్వం, మేనేజ్‌మెంట్ రంగాల్లో చేసిన కృషిని గుర్తించిన ఫ్రాంక్‌ఫర్ట్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం అతనికి డాక్టరేట్‌ను అందించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో పద్మశ్రీ పురస్కార గ్రహీత జితేందర్ సింగ్ షంటీ, ఢిల్లీ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ డాక్టర్ సుమిత్ సేఠి చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ పొందిన ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.


న్యూఢిల్లీలో డాక్టరేట్ అందుకుంటున్న రామారావు

రైతులకు మేలు చేసేందుకే ఆధునిక యంత్రాలు

జగ్గంపేట: రైతులకు మేలు చేసేందుకు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే ప్రభుత్వం రైతులకు ఆధునిక పనిముట్లు అందిస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని క్యాంపు ఆఫీసులో గండేపల్లి మండలం సూరంపాలెం వేంకటేశ్వరా సీహెచ్‌సీ గ్రూపునకు రాయితీపై మంజూరైన డ్రోన్‌ను గురువారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అన్నదాతలు డ్రోన్‌తో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకోవడం ద్వారా ఖర్చులు ఆదా అవుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

తలుపులమ్మకు చీర, సారె సమర్పణ


అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే దివ్య, మహిళలు

తుని రూరల్: లోవదేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే యనమల దివ్య, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు చీర, సారె సమర్పించారు. ఆషాఢ మాసంలో రెండో గురువారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దివ్య సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాలను ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు అందజేశారు. తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, తుని మున్సిపల్ మాజీ చైర్మన్ కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


పెద మల్లాపురంలో బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

శంఖవరం: మండలంలోని పెద మల్లాపురంలో బాధిత కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన పలకా నరసింహమూర్తి, హనికి ఇంజయ్య ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్‌లు గుండు చెంచుబాబు, దొడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పసగడుగుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తుంపాటి దేవుడురాజు, జలుమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

గండేపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ పీఆర్వో, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత టి.గంగాధర్ పుట్టిన రోజును పురస్కరించుకుని యూనివర్సిటీ ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, తదితరులు గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్డ్ గ్రంథాలయాధికారికి సత్కారం

జగ్గంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కె.భాస్కరరావు దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో పాఠకులు, ఉద్యోగులు, పూలమాల, శాలువాతో భాస్కరరావు దంపతులను సత్కరించారు. లైబ్రేరియన్‌గా భాస్కరరావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, వేములకొండ జోగారావు, కొత్త కొండబాబు, మారిశెట్టి బద్రం, చంద్రమౌళి వెంకటశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.